కథా నిలయం
6053
శ్రీకాకుళం

# శివరాముడు - శిరస్త్రాణం

ఆ రోజు పొద్దున్న ఆఫీసుకి రాగానే - దమయంతికి పిడుగులాంటి వార్త తెలిసింది...! 'తన పక్క సీట్లో కూర్చుని పని చేసే సెక్షనాఫీసరు భానుమూర్తి - రాత్రి స్కూటర్ యాక్సిడెంట్‌లో చనిపోయాడట....! డిపార్ట్‌మెంట్ వాళ్ళంతా భానుమూర్తి ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆ తర్వాత సెక్షన్‌లో చాలా మంది అతని మంచితనం గురించీ-నీతి నిజాయితీ గురించీ మాట్లాడేరు... తర్వాత యధాప్రకారం క్యాంటీనులో కాఫీలు తాగి - అందరూ ఎవరి సీట్లో వాళ్లు కూర్చున్నారు... పని చేస్తూనే - భానుమూర్తి గురించి ప్రస్తావించు కుంటున్నారు...

"అంత మంచి మనిషికి - ఆ తాగుడెలా అలవాటైందో"

"ఈ రోజుల్లో నూటికి డెబ్బైమంది తాగుతూనే వుంటారు. కానీ స్కూటర్ మీద వెళ్లేవాడు - అంత పీకల్దాకా తాగటం ఎందుకూ?"

"చీకట్లో రోడ్డు డివైడర్ కనిపించలేదేమో పాపం...!"

"మరే...! ఆ రోడ్డు 'డివైడర్'కి తల కొట్టుకోవటం వల్లనే - సడెన్‌గా ప్రాణం పోయిందిట! తలకి 'హెల్మెట్' వుంటే - ఇంత ఘోరం జరిగేది కాదు!"-అలా అందరూ తలోమాటా అంటున్నారు.

ఆ మాటలు వింటున్న దమయంతికి చటుక్కున తన భర్త శివరాం గుర్తుకొచ్చాడు.

శివరాం, సికింద్రాబాద్‌లో వున్న ఓ ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. మెహదీపట్నం నించి రోజూ స్కూటర్ మీదనే ఆఫీసుకి వెడుతూంటాడు... వారానికి రెండు మూడు సార్లయినా - ఎవరిదో 'పార్టీ' పేరుతో - తాగి వస్తూంటాడు... ఆ అలవాటు 'దురలవాటు' కాకూడదనీ - ఎప్పుడు తాగినా రెండు పెగ్గులకంటే మించకూడదనీ - ఓసారి అతని చేత తను 'ఒట్టు' వేయించుకుంది....

"అయినా ఏ వేళకి ఏం బుద్ధి పుడుతుందో? ఎవరైనా మొహమాట పెట్టి - మరో నాలుగైదు పెగ్గులు ఎక్కువ తాగిస్తే...? ఆ మైకంలో - స్కూటర్ ఎక్కి డ్రైవ్ చేస్తూ - భానుమూర్తి లాగే, ఎక్కడైనా ఏ రోడ్డు డివైడర్‌నో ఢీ కొట్టి" - అంతకు మించి ఎక్కువగా ఇంకేమీ ఊహించలేకపోయింది దమయంతి... వెంటనే తన భర్తకి ఓ 'హెల్మెట్టు' కొనివ్వాలని

నిర్ణయించుకుంది.

పెళ్ళయినప్పట్నించీ – శివరాంకి ఏది కావాలన్నా తనే కొనిస్తూంటుంది.... ఆ మాటకొస్తే – 'పెద్దగా' చదువూ, 'చిన్నగా' ఉద్యోగం కూడా లేని శివరాంని పెళ్లి చేసుకున్నాక అతనికి ఈ చిరుద్యోగాన్ని కూడా తనే కొనిపెట్టింది.... అతను ఉద్యోగంలో చేరిన తర్వాత, అంత దూరంలో వున్న ఆఫీసుకి సిటీ బస్సులో ఉస్సురని నిట్టూరుస్తూ ప్రయాణం చేయటం చూసి 'పిటీ'తో – తన ప్రావిడెంట్ ఫండులోంచి డబ్బు 'డ్రా' చేసి – ఓ స్కూటరు కూడా కొనిపెట్టింది. ఇలా భర్తకు కావాల్సినవన్నీ – దమయంతే కొనిపెట్టటానికి, ఓ కారణం వుంది...

అది – తన మెడలో అతను 'ఉచితం'గా తాళికట్టటం!

అవును!.... ఎలాంటి కట్న కానుకలూ ఆశించకుండా శివరాం ఆమెను పెళ్లి చేసుకున్నాడు... అందువల్ల – అతని పట్ల ఆమెకు ఎంతో గౌరవం వుంది... అలాగే 'సెక్రటేరియట్'లో నెలకు పదిహేను వేలకు పైగా జీతం వచ్చే హోదాలో వున్న దమయంతి కాలేజీ డిగ్రీ, కనీస ఉద్యోగం కూడా లేని తనను ఇష్టపడి భర్తగా స్వీకరించినందుకు ఆమె పట్ల శివరాం కూడా కృతజ్ఞత చూపుతూంటాడు...

ఆ రోజు సాయంత్రమే – ఆఫీసు నించి ఇంటికి వెళ్లే ముందు తనను 'పికప్' చేసుకోటానికి వచ్చిన శివరాంని 'ఆబిడ్స్' తీసుకెళ్లి – అతని తలంతా మున్గిగిపోయేలా ఓ 'పేద్ద' హెల్మెట్ కొనిపెట్టింది. మరింత ముందు జాగ్రత్త చర్యగా శివరాం చేత మరో ప్రమాణం కూడా చేయించింది... 'సాయంత్రం ఆఫీసు నించి తిన్నగా ఇంటికే వస్తాననీ – దారిలో తప్పనిసరిగా ఆమెను 'పికప్' చేసుకుంటాననీ – తప్పనిసరైతే 'మందు పార్టీ'లకు ఆదివారాల్లో మాత్రమే, అది కూడా ఆటోలోనే వెడతా'నని శివరాం ప్రమాణం చేశాడు... ఆ విధంగానే రోజులు సాఫీగా గడిచిపోతున్నాయి.

ఎప్పటిలాగానే, ఆ రోజు ఆఫీసునించి బయటపడి స్కూటరెక్కాడు శివరాం... పద్మవ్యూహం లాంటి ట్రాఫిక్కును ఛేదించుకుంటూ వచ్చి – సెక్రటేరియట్ ఎదురుగా వున్న 'ఎల్.ఐ.సి. బస్‌స్టాప్' దగ్గర ఆగేడు... రోజూ అతనలా ఆగగానే అప్పటికే అక్కడ నిలబడి 'వెయిట్' చేసే దమయంతి స్కూటరెక్కుతుంది. ఇప్పుడు కూడా స్కూటరు ఆపగానే ఆమె వచ్చి వెనకాల కూర్చుంది... స్కూటరు చిన్న 'జర్క్' ఇచ్చి బయల్దేరింది.. ఆమె తన కుడి చేతిని అతని నడుం చుట్టూ వేసి బిగించింది. మరో పది నిమిషాల్లో – మెహిదీపట్నంలోని తమ వీధి వైపు తిప్పేడు శివరాం తన స్కూటర్ని...

"ఇదేమిటీ - ఇటు తీసుకెడుతున్నారూ?" - అడిగిందామె.

ఆ గొంతు విన్న శివరాం ఉలిక్కిపడ్డాడు... సడెన్ బ్రేకుతో స్కూటరు ఆపేడు. గభాల్న వెనక్కి తిరిగి చూశాడు ఆమె తన భార్య దమయంతి కాదు!... "మీరు... మీరు... దమయంతి కాదా?" తెల్లబోయి, తడబడుతూ అడిగేడు. ఆమె చటుక్కున స్కూటరు దిగింది. "మీరు... మీరు వారు కాదా?" - అంది కొంచెం భయంగా చూస్తూ. "వారా?.... వారెవరూ?... అసలు మీరెవరూ?... నా బండి మీద ఎందుకు ఎక్కారూ?" - గబగబా ప్రశ్నల వర్షం కురిపించాడు శివరాం.

"నా పేరు సువర్చల!... ఎల్.ఐ.సి.లో క్లర్క్‌గా పని చేస్తున్నాను. మా వారు మున్సిపల్ ఆఫీసులో ఇంజనీరు... మేం 'లంగర్ హౌస్'లో వుంటాం... రోజూ ఆఫీసు కాగానే ఆయన ఇక్కడకొచ్చి నన్ను 'పికప్' చేసుకుంటారు!" - ఆమె కూడా గబగబా చెప్పేసింది.

"మిమ్మల్ని ఎవరు పికప్ చేసుకుంటే నాకేమిటీ?... నా బండి మీద మీరెందుకు కూర్చున్నారూ - అని అడుగుతున్నా!" - చిరాకు పడిపోయాడు శివరాం.

"మా వారిది కూడా అచ్చం - ఇలాంటి నీలం రంగు స్కూటరే!... ఇదొచ్చి అక్కడ ఆగేసరికి - మా వారే అనుకుని ఎక్కేశాను!"

"అది కాదండీ! స్కూటర్ చూసి ఎక్కేస్తే ఎలా?... వచ్చింది మీ వారో, పరాయి వారో చూసుకోవద్దూ?" - కొంచెం మెత్తబడుతూ అడిగేడు.

"చూసే ఎక్కాను!... మా వారిది కూడా అచ్చం మీరు పెట్టుకున్న హెల్మెట్ లాంటిదే!... ముదురు నీలం!... అయినా, అసలు బండి వెనకాల ఎవరెక్కి కూర్చుంటున్నారో చూసుకోవాల్సిన బాధ్యత మీకు మాత్రం లేదా?" సీరియస్‌గా అడిగిందామె.

"ఆ బాధ్యతా, అవసరం నాకు లేవు!... అక్కడ స్టాప్‌లో - రోజూ నేను స్కూటరు ఆపగానే మా ఆవిడ వచ్చి వెనకాల కూర్చుంటుంది... తను సెక్రటేరియట్‌లో పని చేస్తోంది" - చెప్పాడు శ్రీరాం.

"సర్లెండి !... చేసిన నిర్వాకం చాలు కానీ - తొందరగా స్కూటర్ వెనక్కి తిప్పండి... ఆ బస్‌స్టాప్‌లో మీ కోసం మీ ఆవిడా - నా కోసం మా ఆయనా వెయిట్ చేస్తుంటారు!"

శివరాం మళ్లీ స్కూటర్ వెనక్కి తిప్పాడు... ఆమె వెనకాల ఎక్కి కూర్చుంది... ఇప్పుడు అతనికి బాగా 'ఎడం' గా - సాధ్యమైనంత వరకూ అతనికి తన 'చీర చెంగు' కూడా తగలనంత జాగ్రత్తగా కూర్చుంది... స్కూటర్ వేగంగా వెడుతోంది.

"చెడ్డ ఆలోచనలు నాకు రావు కనుక సరిపోయింది!... అదే ఏ దుర్మార్గపు ఆలోచనో వున్న వాడి స్కూటర్ ఎక్కి వుంటే - మిమ్మల్ని ఈ పాటికి ఊరి పొలిమేరల్లో వున్న ఏ

పాడుబడిన 'టూంబ్స్' లోకో తీసుకుపోయి - సినీమాల్లో హీరోయిన్స్‌ని విలన్లు బలాత్కరించినట్టుగా..." స్కూటర్ డ్రైవ్ చేస్తూనే - మళ్లీ జోక్ చేస్తున్న గర్వంతో నవ్వేశాడు శివరాం. అతని మాటలు ఆమెకు సరిగా విన్పించకపోవటం వల్ల - బదులు చెప్పలేదు...

పది నిమిషాల్లో, స్కూటరు మళ్లీ ఎల్.ఐ.సీ. బస్‌స్టాప్ దగ్గరకొచ్చి ఆగింది. అక్కడ ఎక్కువగా జనం లేరు - ఉన్న జనంలో శివరాంకి తన భార్య కనిపించలేదు... అలాగే తన భర్త - అక్కడే, తన కోసం ఎదురు చూస్తూ నిలబడి వుంటాడని భావించిన సువర్చలకు కూడా నిరాశే మిగిలింది. ఇద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

"మీరిక్కడ కనిపించకపోయే సరికి బస్సులో వెళ్ళిపోయారనుకుని మీ వారు ఇంటికెళ్లుంటారు! అంచేత మీ దారిన మీరు బస్కెక్కేయండి! నేను లాగిం చేస్తాను!... బై" అంటూ శివరాం బండి 'స్టార్ట్' చేశాడు.

జరిగిన సంఘటనతో బుర్ర వేడెక్కిపోయి దగ్గర్లో వున్న బార్లో ఓ మూడు పెగ్గులు తాగేడు. మరో అరగంటలో ఇంటి గుమ్మం దగ్గర నిలబడి తలుపు తట్టేడు. దమయంతి తలుపు తీసింది...

తీస్తూనే సడెన్‌గా -"నన్ను క్షమించండీ! ఇంకెప్పుడూ ఇలా తొందరపడను!" అంది కళ్ళ నీళ్ళ పర్యంతమవుతూ.

తనను పికప్ చేసుకునేందుకు రాకపోగా - తాగొచ్చి నందుకు అక్షింతలు వేస్తుందన్న భయంతో అడుగుపెట్టిన శివరాం ఆమె ప్రవర్తనకు అర్థం తెలియక అయోమయంగా చూశాడు.

"ఏమైందీ దమయంతీ!... తొందర పడటం ఏమిటీ?" - అడిగేడు ఖంగారుగా.

"మీ స్కూటరనుకుని - ఎవరి స్కూటరు మీదో ఎక్కేశాను!" - చెప్పిందామె.

"ఆ? " షాకయ్యాడు శివరాం... తాగిన 'మందు' తాలూకు మత్తంతా దిగిపోయింది.

"ఔనండీ!... రోజూలాగానే సాయంత్రం ఆఫీసు నించి బస్‌స్టాప్ కొచ్చి - మీ కోసం వెయిట్ చేస్తూ నిలబడ్డాను. అంతలో 'రయ్' మంటూ ఓ నీలం రంగు స్కూటరొచ్చి అక్కడ ఆగింది... ఆ స్కూటరు మీదున్న మనిషి కూడా అచ్చం మీ 'హెల్మెట్' లాంటిదే పెట్టుకున్నాడు. అతను 'మీరే' అనుకుని ఎక్కేశాను"

"ఏడవలేకపోయావ్!" - కోపంగా అన్నాడు శివరాం.

"విషయం బోధపడ్డాక ఏడ్చానండీ!" - ఏడుస్తూనే చెప్పింది.

"అంటే?"

"అతను - స్కూటర్ని మనింటి వైపు కాకుండా - ఊరి పొలిమేరల వైపు వేగంగా తీసుకుపోతూంటే - అనుమానం వచ్చి చూశాను. అతను 'మీరు' కాదని గ్రహించాక

అరిచాను..."అరిచావంటే ప్రాణం తీస్తాను" అంటూ నన్ను బెదిరించి - ఇంకా స్పీడుగా స్కూటర్ని పోనిచ్చి - ఊరి చివర పాడుబడ్డ టూంబ్స్ దగ్గరకి.." - ఏడుపు ఎక్కువై ఆమెకు నోట మాట రావటం లేదు...

"ఊ! ఊరి చివర టూంబ్స్ దగ్గరికి?" - గద్దించి మరీ అడిగేదు.

"తీసుకెళ్లాడు!..." ఏడుపు తాలూకు వెక్కిళ్లు ఆమె మాటలకు అడ్డం పడ్డాయి.

"నన్ను... నన్ను తన దగ్గరకు లాక్కుని బలవంతం చేయబోతే - నేను ఏడుస్తూ కేకలు పెట్టేను... అదృష్టం బావుండి - ఆ సమయంలో రోడ్డు మీద వెడుతున్న ఓ పెద్ద మనిషి నా కేకలు విన్నాడు.. పరుగెత్తుకుంటూ వచ్చాడు. ఆయన్ని చూసి ఆ దుర్మార్గుడు పారిపోయాడు" - చెప్పటం ముగించి కళ్లు తుడుచుకుంది దమయంతి.

అంతకుమించి మరే ఘోరమూ జరగనందుకు శివరాం తృప్తిగా ఉపిరి పీల్చుకున్నాడు. అంతలో దమయంతి మళ్లీ చెప్పింది - "జరగరానిదేదైనా జరిగి వుంటే నా మొహం మళ్లీ మీకు చూపించేదాన్ని కాదు... అక్కడే పాడు పడిన నూతిలో దూకి ఆత్మహత్య చేసుకునే దాన్ని..." - అంటూ మళ్లీ ఏడుపు ప్రారంభించింది.

ఆ రాత్రి తెల్లవార్లూ ఆమెను ఓదార్చటంతోనే సరిపోయింది శివరాంకి.!

(యోజన
మార్చి 2004)